సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన సమ్మెట పర్శరాములు కూతురు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆశీర్వదిస్తూ.. శుభాకాంక్షలు చెప్తూ..

- సిరిసిల్లలో కేటీఆర్ విస్తృత పర్యటన
- పలు శుభకార్యాలకు హాజరు

సిరిసిల్ల టౌన్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట, మే 18: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సిరిసిల్ల పట్టణంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. పలు చోట్ల యువతీయువకులు కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. చిన్నారులతో కలిసి వచ్చిన దంపతులు సైతం కేటీఆర్‌తో కలిసి ఫొటోలు దిగారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్దిలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలుచేశారు. అనంతరం పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించారు.

తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కారే

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గెలిచేది బీఆర్ఎస్సే
- పెనుబల్లి మండల పర్యటనలో ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్

పెనుబల్లి, మే 18: తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కారేనని ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్ స్పష్టంచేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ గెలుస్తుందని జోస్యం చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలానికి ఆదివారం వచ్చిన ఆయన.. పెనుబల్లిలో తన చిరకాల మిత్రుడైన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటగిరి సుధాకర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా అక్కడే మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. తమకెవరూ అప్పులివ్వడం లేదంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రే తన స్థాయిని మరిచి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే తమకు నడుస్తలేదంటూ రోజూ అవే మాటలు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసమే అప్పులు చేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి ఆనవాళ్లు, సంక్షేమ పథకాలు ఇప్పటికీ కండ్లముందే కన్పిస్తున్నాయని తెలిపారు.

- నర్సింగాపురంలో ఖాళీ బిందెలతో నిరసన

తాగునీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి జీపీ పరిధిలోని నర్సింగాపురంలో మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. నెల నుంచి నల్లా నీళ్లు రావడం లేదంటూ ఆందోళన చేపట్టారు. -నర్సంపేట

కొత్త ఇసుక పాలసీ బూమరాంగ్!

- ప్రజలపై అధిక భారం మోపినా ఫలితం మాత్రం శూన్యం
- సర్కారు ఖజానాకు తగ్గిన రూ.100 కోట్ల ఆదాయం
- అధికారులపై సీఎం చిర్రుబుర్రు
- పునరాలోచనలో అధికారులు?

హైదరాబాద్, మే 18(నమస్తే తెలంగాణ): కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్టుగా మారింది ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక పాలసీ. నూతన విధానంతో భారీ ఆదాయం వస్తుందన్న ప్రభుత్వ పెద్దలు, అధికారులు మాటలు తప్పని తేలిపోయింది. ఖజనాకు కాసుల గలగల ఏమోగానీ వెలవెలబోయేలా చేసింది. కొత్త ఇసుక పాలసీ తలకిందులైంది. భారీ రాబడి సంగతి పక్కన పెడితే ఆదాయం తగ్గిపోయింది. ప్రజలపై టన్ను ఇసుకకు రూ.500 వరకు అదనపు భారం మోపినప్పటికీ ప్రభుత్వానికి రావాల్సినంత ఆదాయం రాలేదు. నిరుడితో పోల్చుకుంటే రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. అధికారుల అత్యుత్సాహం ఫలితంగా ఇసుకకు కృత్రిమ కొరత ఏర్పడి నిర్మాణరంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడింది... కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టింది.

మధ్యతరగతి బడ్జెట్ తారుమారు

ఇసుక ధర రూ.2,000లకు చేరుకోవంతో భవననిర్మాణాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతున్నది. బడా బిల్డర్లు వినియోగదారులపై భారంమోపి తమ ఖర్చులు రాబట్టుకుంటారు. కానీ వ్యక్తిగత గృహాలు నిర్మించుకునే మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తారుమారవుతున్నది. చాలామంది నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. 100 గజాల్లో రెండు గదుల ఇల్లు నిర్మించుకునేవారిపై సైతం ఇసుక ధర పెరగడంవల్ల రూ.లక్షకుపైగా అదనపు భారం పడినట్టు చెప్తున్నారు.

సర్కారు అత్యుత్సాహం.. తగ్గిన ఆదాయం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకం ద్వారా టీజీఎండీసీకి ఏటా సుమారు రూ.800 కోట్లకుపైగా ఆదాయం సమకూరేది. మార్కెట్‌లో ఎప్పుడూ ఇసుకకు కొరత ఏర్పడలేదు. బహిరంగ మార్కెట్‌లో పుష్కలంగా ఇసుక లభించేది. ఇసుక సరఫరాదారుల మధ్య పోటీ ఉండడంతో ఇసుక ధర టన్నుకు రూ.1,400 దాటలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి తారుమారైంది. అక్రమాలను అరికడతామంటూ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ తీసుకొచ్చింది. తనిఖీల పేరుతో ఇసుక క్వారీలు సజావుగా నడవకుండా చేశారు. ఇసుక లారీలపై ఆంక్షలు విధించారు. వినియోగదారులే నేరుగా బుకింగ్‌లు చేసుకోవాలనే నిబంధన విధించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లు జరగకుండా సాంకేతిక సమస్యలు సృష్టించి దళారులను రంగంలోకి దింపారు. ఇసుకబజార్లను ఏర్పాటుచేసి అధికారికంగానే రూ.1,800 ధర ఖరారు చేశారు. జీఎస్‌టీ, రవాణా ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక ధర రూ.2,000 దాటిపోయింది. ఒకప్పుడు రూ.1,400లకు ఇంటి వద్దకు చేరాల్సిన ఇసుకకు ఇప్పుడు రూ.2,000 ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అయినా గతంలో మాదిరిగా అందుబాటులో ఉండడంలేదు. శాండ్‌బజార్లలో నాసిరకం ఇసుకను ఉంచడంతో వినియోగదారులకు నాణ్యమైన ఇసుక దొరకడమే గగనమైంది. కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టినా ప్రభుత్వంలో చలనం రాలేదని నిర్మాణరంగ నిపుణులు విమర్శిస్తున్నారు. ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ధర పెరిగినా తగ్గిన ఆదాయం

ప్రభుత్వం వినియోగదారులపై భారం మోపినా ఖజానాకు రాబడి మాత్రం పెరగలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. ప్రతి నెలా సగటున రూ.70కోట్ల వరకూ ఆదాయం రావాల్సి ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల అయిన ఏప్రిల్‌లో రూ. 40 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది.

ఇసుక ద్వారా సర్కారుకు ఆదాయం(రూ.కోట్లలో)

సంవత్సరం	ఆదాయం
2023-24	830
2024-25	722
2025-26(ఏప్రిల్‌లో)	40

పునరాలోచనలో అధికారులు

శనివారం టీజీఎండీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఇసుక ఆదాయం తగ్గడంపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కొత్త పాలసీ తీసుకొచ్చిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో తమను బాధ్యులు చేయడమేంటని కొందరు అధికారులు వాపోతున్నారు. ఆదాయం ఎలా పెంచాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. శాండ్ బజార్లలో ఇసుక ధరలు తగ్గించాలా? బహిరంగ మార్కెట్‌లో ఇసుక మరింత అందుబాటులోకి వచ్చేలా చేయాలా? అని అధికారులు ఆలోచనలో నిమగ్నమైనట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం, అధికారులు ఇసుక కృత్రిమ కొరతను సృష్టించడం మానుకోవాలని ప్రజలు, నిర్మాణదారులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

- ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతాం
- మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్
- కాంగ్రెస్ తదితర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

వరంగల్, మే 18 : బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ కార్యాలయం జోలికి వస్తే ఖబడ్దార్ అని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం వరంగల్ నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి మహిళలు, యువకులు బీఆర్ఎస్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి వినయ్‌భాస్కర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నా, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వెంటాడుతామని హెచ్చరించారు. స్వరాష్ట్రాన్ని సాధించిన వాళ్లం కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టంచేశారు. రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ పార్టీయేనని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని కోరారు.

వరంగల్‌లో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో కలిసి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

ముద్ర రుణాల్లో తెలంగాణకు అన్యాయం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
- రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరిరావు సీఎంకు లేఖ

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది అర్హులైన పేద ప్రజలకు ముద్ర రుణాల మంజూరులో అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు వాపోయారు. ముద్ర రుణాల్లో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రంలోని చిరు వ్యాపారులకు, స్వయం ఉపాధితో రాణించే యువకులకు సహకరించాలని కోరారు. ముద్ర రుణాల్లో 2014 నుంచి 2025 వరకు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు.

కఠినంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పేపర్-2

- అన్ని సబ్జెక్టుల్లోనూ అధికంగా న్యూమరికల్ బేస్డ్ క్వశ్చన్స్
- సాధనకు అధిక సమయం

హైదరాబాద్ మే 18 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పేపర్-2 కఠినంగా ఉన్నదని విద్యారంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పేపర్-1తో పోల్చితే పేపర్-2లో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని చెబుతున్నారు. ఒక్కో సబ్జెక్ట్‌లో 16 ప్రశ్నలే ఇచ్చినప్పటికీ న్యూమరికల్ బేస్డ్‌గా అడగడంతో సాధనకు ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉన్నదని విశ్లేషించారు. ప్రతిభావంతులైన విద్యార్థులు అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చినప్పటికీ అవి తప్పా? ఒప్పా? అనే విషయంలో సందిగ్ధత నెలకొన్నదని తెలిపారు. సుమారు 42 ప్రశ్నలు గణితాధారితంగా ఇచ్చారని చెబుతున్నారు. మొత్తంగా 300 మార్కుల వరకు సాధించిన విద్యార్థులు జాతీయస్థాయిలో టాప్ టెన్ ర్యాంకు పొందే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు.

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడులు చేతికి రాక.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక..
- కరీంనగర్ జిల్లా రాయికల్‌లో అన్నదాత బలవన్మరణం

రావుల తిరుపతిరెడ్డి (ఫైల్)

సైదాపూర్, మే 18 : కాలం కలిసి రాక.. అప్పులు తీర్చే మార్గం లేక కరీంనగర్ జిల్లాలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం రాయికల్‌కు చెందిన రావుల తిరుపతిరెడ్డి (38) తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దిగుబడులు సరిగా రాలేదు. పంట పెట్టుబడి, ఇతర అవసరాల కోసం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రైతుల సమస్యలు పట్టని కాంగ్రెస్

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్ • ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పర్వతగిరి, మే 18: కాంగ్రెస్ సర్కారు అన్నదాతల సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఆదివారం ఆయన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండ, కొంకపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనకుండా జాప్యం చేస్తున్నారని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేయగా.. ఎర్రబెల్లి వెంటనే కలెక్టర్ సత్యశారదకు ఫోన్‌చేసి సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఎర్రబెల్లి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్కారు నిర్లక్ష్యం రైతుల ప్రాణాల మీదకు తెచ్చిందని అన్నారు. సాగునీరందించడంలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, ధాన్యం కొనుగోలులో విఫలమయ్యారని మండిపడ్డారు. సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతే ఆదుకోకుండా సర్కారు మొద్దు నిద్రలో ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నదని ఆవేదనచెందారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో చలనం లేదని మండిపడ్డారు. సర్కారు, మిల్లర్లు కలిసి డబుల్ గేమ్ ఆడుతూ రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని 48 గంటల్లో కొనుగోలు చేసి వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ధాన్యం విక్రయించి పది రోజులైనా డబ్బులు రావడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్ల బోనస్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను కలెక్టర్‌కు ఫోన్‌లో వివరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

అకాల వర్షం.. రైతన్న ఆగమాగం

- ధాన్యాన్ని కాపాడుకునేందుకు నిత్యం కర్షకుల అష్టకష్టాలు

అశ్వారావుపేట టౌన్, మే 18: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో ఆదివారం కురిసిన వర్షం.. అన్నదాతలను ఆగంచేసింది. ఇప్పటికే కురిసిన వర్షాల వల్ల అన్నదాతలు భారీగా నష్టపోయారు. ఇప్పుడు మళ్లీ వర్షం కురుస్తుండటంతో ఇంకెంత నష్టం వాటిల్లుతుందోనిన ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఆదివారం నాటి అకాల వర్షానికి పలు గ్రామాల రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలుపడ్డారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, ఉట్లపల్లి, నారాయణపురం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడవకుండా పరదాలు కప్పారు. కానీ కేంద్రాల్లోకి మాత్రం వరదనీరు చేరింది. 20 రోజులైనా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేశారు. అందువల్లనే తమ పంటలు వరదపాలై తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

శ్రీలంకలోకి ప్రవేశించిన నైరుతి

- పదిరోజుల ముందుగానే ప్రవేశం
- 27నాటికి కేరళకు రుతుపవనాలు
- నెన్నాల్‌లో 6.91 సెం.మీ గరిష్ఠ వర్షం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు పది రోజుల్లో కేరళను తాకనున్నాయని కేంద్ర వాతావరణ శాఖ వెల్లడించింది. వాస్తవానికి రుతుపవనాలు ఈనెల 22న అండమాన్‌కు, 26న శ్రీలంకను తాకొచ్చని భావించగా, పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి ప్రవేశించాయని తెలిపింది. ప్రస్తుతం శ్రీలంక, అండమాన్‌లో విస్తరించాయని, 27నాటికి కేరళను తాకే అవకాశం కనిపిస్తున్నదని పేర్కొన్నది. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దీని ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు విస్తరంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ - మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడినట్టు తెలిపింది. మంచిర్యాల జిల్లా నెన్నాల్‌లో అత్యధికంగా 6.91 సెం.మీ, నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండలో 5.52 సెం.మీ, ఇంద్రవెల్లిలో 4.28 సెం.మీ, మంచిర్యాల జిల్లా చెన్నూరులో 4.99 సెం.మీ, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లిలో 4.57 సెం.మీ, సిద్దిపేట జిల్లా కొండపాకలో 3.93 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నది. ఇక 15జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో అత్యధికంగా 41.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు తెలిపింది. సోమవారం మంచిర్యాల, జగిత్యాల, రాజన్న- సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్‌తోపాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడతాయని పేర్కొంది. మంగళవారం నుంచి శనివారం వరకు పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని అంచనా వేసినట్టు వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసినట్టు వెల్లడించింది.

పెండింగ్ వేతనాలా మర్చిపోండి!

- మినీ అంగన్‌వాడీలకు మొండి'చెయ్యి'
- పట్టించుకోని మంత్రి, అధికారులు
- ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తిలో టీచర్లు
- ఉద్యమానికి యూనియన్ సన్నద్ధం

హైదరాబాద్ మే 18 (నమస్తేతెలంగాణ): 'ప్రమోట్ చేయడమే గొప్ప.. పెండింగ్ శాలరీలు మరిచిపోండి అంటూ ఉన్నతాధికారులు చులకనగా మాట్లాడుతున్నారు.. మంత్రికి విన్నవించినా పట్టించుకోవడమే లేదు' ఇవీ అంగన్‌వాడీలుగా ప్రమోషన్ పొందిన మినీ అంగన్‌వాడీలకు ఎందురైన చేదు అనుభవం. ఈ దశలో ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, లేదంటే ఉద్యమమే శరణ్యమని మినీ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను ప్రధాన అంగన్‌వాడీలుగా ప్రమోట్ చేసిన ప్రభుత్వం పెండింగ్ వేతనాలు అడిగితే ముఖం చాటేస్తున్నది. 12 నెలలకు సంబంధించి సుమారు రూ.28 కోట్ల పెండిగ్ వేతనాలను ఇవ్వకుండా మెండిచేయ్యి చూపుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్క 2023 డిసెంబర్ 14న మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసే ఫైల్ పైనే తొలి సంతకం చేశారు. ఒక్క సంతకంతోనే 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్ల బతుకుల్లో వెలుగులు నింపినట్టు గొప్పగా చెప్పుకున్నారు. 2024 జనవరి నుంచే అమల్లోకి తీసుకొస్తున్నామని, ఇక నుంచి వారికి ప్రధాన అంగన్‌వాడీలతో సమానంగా ప్రతి నెలా రూ.13,650 చొప్పున వేతనం అందుతుందని ప్రకటించారు. మంత్రే స్వయంగా ఎక్స్‌లో ట్వీట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. కాంగ్రెస్ ట్విట్టర్ హ్యాండిల్‌లోనూ పోస్టులు పెట్టారు. కానీ మూడు నెలలు(జనవరి, ఫిబ్రవరి, మార్చి) పెరిగిన వేతనాలు జమచేసి మురిపించారు. మళ్లీ ఏప్రిల్, మే నెలల్లో కథ మొదటికొచ్చింది. తిరిగి రెండు నెలలు మే, జూన్‌లో మళ్లీ పాత వేతనాలైన రూ.7,600 చొప్పున ఇచ్చారు. ఇదేమిటని గగ్గోలు పెడితే జూలైలో పెంచిన జీతాలను జమచేశారు. ఆ తర్వాత నెల నుంచి తిరిగి పూర్వపు పద్ధతిలోనే వేతనాలు అందజేస్తూ వస్తున్నారు.



Congress for Tela... @Congress4TS Follow

Upgrading Mini Anganwadi Center's
-- Seethakka First Sign as Minister

మంత్రిగా నా తొలి సంతకంతో 3989 మినీ అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ అయ్యాయి.
ప్రస్తుతం రూ.7500 జీతం పొందుతున్న మినీ అంగన్వాడీ టీచరు ఇకపై రూ.13,500 వస్తాయి.
ప్రతి కేంద్రానికి ఒకరి చొప్పున మొత్తం 3989 హెల్పర్స్ ను నియమించుకోవచ్చు.
-- మంత్రి సీతక్క

With my first signature as a minister, 3989 mini Anganwadi centers were upgraded to main Anganwadi centers.
Mini Anganwadi teachers who is currently getting a salary of Rs.7500 will now get Rs.13,500.
A total of 3989 helpers can be hired, one per center.
-- Minister Seethakka

గత్యంతరంలేకే దిగొచ్చిన సర్కారు

సర్కారు వైఖరిపై విసిగిపోయిన మినీ అంగన్‌వాడీ టీచర్లు అనేకసార్లు మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మీడియాలోనూ కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో దిగొచ్చిన సర్కారు మే 6న మినీ అంగన్‌వాడీ టీచర్లం దరికీ పెరిగిన వేతనాలు అమలు చేస్తామని ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని సుమారు 10 జిల్లాల్లో ఏప్రిల్‌కు సంబంధించిన పెరిగిన వేతన నగదును జమచేశారు. మిగతా జిల్లాల అంగన్‌వాడీలకు మాత్రం ఇంతవరకు అందలేదని యూనియన్ నేతలు చెప్తున్నారు. 12 నెలల పెండింగ్ వేతనాల ఊసే ఎత్తడంలేదని వాపోతున్నారు. మంత్రి మొదటి సంతకానికే విలువ లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు.

రైతులు నిండా మునిగాక హడావుడి!

- అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాత
- ధాన్యం కొనుగోలులో సర్కారు నిర్లక్ష్యం
- ఇప్పదేమో మంత్రి ఉత్తమ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనలు
- ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగాక తీరిగ్గా ఆదేశాలు
- టార్పాలిన్లు, వేయింగ్ మిషన్లు ఇప్పుడు సమకూర్చాలట!
- వర్ష సూచన తెలిపేలా టెక్నాలజీ తెచ్చామంటూ గొప్పలు
- వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు గత లెక్కలతో తంటాలు

హైదరాబాద్, మే 18(నమస్తే తెలంగాణ): చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నది రాష్ట్ర పౌరసరఫరాల శాఖ తీరు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి, వరదల్లో కొట్టుకుపోతుంటే అటువైపు కన్నెత్తి కూడా చూడని మంత్రులు, అధికారులు.. ఇప్పుడేమో హడావుడి చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని వరుసగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తుండగా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ధాన్యాన్ని రక్షించేందుకు, వేగంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. టార్పాలిన్స్, వేయింగ్ మిషన్లు సమకూర్చాలని ఆదేశాలిస్తున్నారు.

జోరు వానలు.. పత్తాలేని అధికారులు

ధాన్యం కొనుగోలు ఊపందుకునే సమయం నుంచి అకాల వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ధాన్యం మొత్తం తడిసిపోగా, మరికొన్ని చోట్ల కొట్టుకొనిపోయింది. ఒకవైపు వర్ష సూచనలు ఉన్నాయంటూ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ